

ముగిసిన మినీజాతర
ఈనెల 12న ప్రారంభమైన మేడారం మినీ జాతర శనివారంతో ముగిసింది. లక్షల సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు సమర్పించారు.
- 8లో▸



రూ.21.56కోట్లతో పుష్కరాల పనులు
- 8లో▸
మే 15 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించే సరస్వతీ నది పుష్కరాలకు ప్రభుత్వం రూ.21.56కోట్ల నిధులు మంజూరు చేసింది.

గరిష్టం/కనిష్టం
$35^0/17^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం మంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. రాత్రి చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయించాలి



జనగామ రూరల్: రాబోయే రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి మొత్తం బడ్జెట్‌లో 15శాతం కేటాయించాలని సాదిక్ ఫౌండేషన్ చైర్మన్, హైకోర్టు న్యాయవాది సాదిక్ అలీ అన్నారు. సాదిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏకశిల డిగ్రీ కాలేజీలో శనివారం విద్యా మహోద్యమ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సాదిక్ ఫౌండేషన్ చైర్మన్, హైకోర్టు న్యాయవాది సాదిక్ అలీ మాట్లాడుతూ విద్యా మహోద్యమానికి ప్రజలు మద్దతునిస్తూ అనేక విధాలుగా సహకరిస్తున్నారని ఈ నెల 17 సోమవారం సాదిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టుకార్డులు రాసి పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల విద్యార్థులు, సాదిక్ ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

84 మంది గైర్హాజరు

జనగామ రూరల్: జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు 84 మంది గైర్హాజరయ్యారని డీఐఈఓ జితేందర్‌రెడ్డి తెలిపారు. మొదటి సెషన్‌లో జనరల్, ఒకేషనల్‌లో 573 విద్యార్థులకు 509 విద్యార్థులు హాజరు కాగా 64 మంది గైర్హాజరయ్యారు. రెండవ సెషన్‌లో జనరల్, ఒకేషనల్ 397 విద్యార్థులకు గాను 377 మంది హాజరు కాగా 20 మంది గైర్హాజరయ్యారు. జిల్లా కేంద్రంలో పలు పరీక్ష కేంద్రాలను డీఐఈఓ జితేందర్‌రెడ్డి సందర్శించగా జిల్లా పరీక్షల నియంత్రణ అధికారులు ఎస్. శ్రీనివాస్, వి.శేఖర్ జఫర్‌గఢ్, జనగామ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

నిట్‌లో 'క్యూరా-25' వేడుకలు షురూ!

కాజీపేట అర్బన్ : నిట్ వరంగల్‌లోని రామన్ సెమినార్ హాల్‌లో రెండు రోజులపాటు జరిగే 14వ నేషనల్ లెవల్ మేనేజ్‌మెంట్ ఫెస్టివల్ 'క్యూరా-25' వేడుకలను శనివారం టీజీఎస్పీడీసీఎల్ చైర్మన్ అండ్ సీఎండీ వరుణ్‌రెడ్డి కర్నాటి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బిజినెస్ స్కూల్ విద్యార్థులు తమ అభిప్రాయాలను పంచుకునే నూతన ఆవిష్కరణలకు వేదికగా 'క్యూరా-25' నిలవాలన్నారు. ప్రపంచం భారతదేశాన్ని వ్యాపార కేంద్రంగా చూస్తోందని, ఇందుకు తగ్గట్టుగా బిజినెస్ స్కూల్ విద్యార్థులు పారిశ్రామిక వేత్తలుగా రాణించాలని ఆకాంక్షించారు. దేశవ్యాప్తంగా 120 మంది బిజినెస్ స్కూల్ విద్యార్థులు ఈ వేడుకల్లో పాల్గొంటారని, ఏడు రకాల పోటీలు నిర్వహించనున్నట్లు క్యూరా స్టూడెంట్ కోఆర్డినేటర్ శర్థిల్ తెలిపారు. కార్యక్రమంలో నిట్ ప్రొఫెసర్లు వేణువినోద్, సునీత, మహమ్మద్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

హేమాచల క్షేత్రంలో భక్తుల సందడి

మంగపేట : మండలంలోని మల్లూరు హేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం, చింతామణి జలపాతం, వనదేవత(దైత) అమ్మవారి ప్రాంత పరిసరాల్లో కోలాహలం నెలకొంది. ఆలయంలోని స్వయంభు స్వామివారిని దర్శించుకునేందుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారితోపాటు ఆంధ్రప్రదేశ్ నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఆలయ సమీపంలోని పవిత్ర చింతామణి జలపాతం వద్ద స్నానాలు చేసి హేమాచల కొండపైకి చేరుకున్నారు. స్వయంభు స్వామివారిని దర్శించుకున్న భక్తులు లక్ష్మీనర్సింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్లకు పూలు, పండ్లు, పట్టు వస్త్రాలు సమర్పించారు. అర్చకులు స్వామివారికి తిలతైలాభిషేకం నిర్వహించారు.సంతానం కోసం వచ్చిన దంపతులకు స్వామివారి నాభిచందన ప్రసాదాన్ని అందజేశారు.



గారడి ముసుగు

శివుడిని అమితంగా ఇష్టపడే కొందరికి గజ్జెల లాగు అంటే బహు ప్రీతి.. అత్యంత పవిత్రంగా చూస్తారు.. నీసు తగలనివ్వరు.. తల స్నానం చేయనిదే తాకనైనా తాకరు.. మట్టి రేణువులు కూడా లాగును తాకొద్దని నేలపై సంచులు పరిచి విప్పుతారు.. మిగతా వస్త్రాలతో కాకుండా వేరుగా శుభ్రం చేస్తారు.. భక్తులు అంత పవిత్రంగా భావించే ఆ లాగుల్ని తయారు చేస్తున్నాయి నడికూడ మండలకేంద్రానికి చెందిన కొన్ని కుటుంబాలు. ఆ గజ్జెల సవ్వడే.. భక్తుల నాదమవుతోంది. శివరాత్రి సమీపిస్తున్న సందర్భంలో శిగాలెత్తే శివభక్తుల అలంకరణ వస్తువులపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

\- సాక్షిప్రతినిధి, వరంగల్/నడికూడ



ఎల్లమ్మ గవ్వల బుట్ట

సండే స్పెషల్

గజ్జెల లాగులు గవ్వల కుల్లలు

ప్రత్యేక పూజలకు ఉపయోగించే సామగ్రి తయారీకి ప్రసిద్ధి నడికూడ



- పలు రాష్ట్రాలకు ఇక్కడి నుంచే సరఫరా..
- వీటి తయారీని నమ్ముకున్న 200 మంది
- 60ఏళ్లుగా ఉపాధి పొందుతూ..

కొత్తకొండ ఈరన్న.. కొమురెల్లి మల్లన్న.. ఎములాడ రాజన్న.. ఓదెల, ఐనవోలు మల్లికార్జున స్వామి.. ఇలా దేవాలయాలు, జాతరలు ఏవైనా శివసత్తులు, పోతరాజులుంటేనే భక్తజన సందోహం. చిన్నపట్నం, పెద్దపట్నం, అమ్మవారి బోనాలు.. పూజా కార్యక్రమాల్లో పరవశించిన శివసత్తుల శిగాలు.. పోతరాజుల విన్యాసాలు.. ఈరకోల ఆటలు.. మేకపోతులు, కోడిపుంజులను గావుపట్టే పూనకాలు భక్తులను మైమరిపిస్తాయి. ఆయా ఉత్సవాలకు ధరించే ప్రత్యేక దుస్తులు, వస్తువుల తయారీ, సరఫరా కేంద్రం హనుమకొండ జిల్లా నడికూడలో ఉంది. తెలంగాణ, ఆంధ్ర, మహారాష్ట్ర.. ప్రాంతాల్లోని పేరున్న దేవాలయాల్లో శివసత్తులు, పోతరాజులు, భక్తులకు సుమారు 60 ఏళ్లుగా గజ్జెల లాగులు మొదలు ఈరకోలలు, పట్నాల గొంగడి, ఢమరుకం, శూలం.. వరకు ప్రతి ఒక్కటీ నడికూడ నుంచే సరఫరా అవుతున్నాయి. ఇరవై కుటుంబాలు సుమారు 200 మంది నిరంతరం శ్రమిస్తూ ఉపాధి పొందుతుండగా.. ప్రతి ఏడాది డిసెంబర్ నుంచి మార్చి వరకు ఉమ్మడి వరంగల్‌లోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి నడికూడకు వచ్చి వస్తువులను కొనుగోలు చేస్తారు.

సామగ్రికి ప్రసిద్ధి..

తెలంగాణ జానపద సంస్కృతిలో నిర్వహించే పూజల్లో భాగంగా ధరించే గజ్జెల లాగుల తయారీకి నడికూడ గ్రామం ప్రసిద్ధి. కొమురవెల్లి మల్లన్న, ఐనవోలు, బోనాలు, సమ్మక్క-సారలమ్మ జాతరలో, పట్నాలు, పెద్ద పట్నం, గట్టు మల్లన్న జాతరల్లో ఈ గజ్జెల లాగులు, పసుపుపచ్చని అంగీలు ధరిస్తారు. వేములవాడ, కొండగట్టు, శ్రీశైలం, హైదరాబాద్, రంగారెడ్డి, విజయవాడ తదితర తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి వచ్చి సామగ్రిని తీసుకెళ్తారు. గజ్జల లాగులకు బ్రాండ్‌గా నడికూడ గ్రామం నిలుస్తోంది. వీటిని ధరించే వారు ఎంత నిష్టగా ఉంటారో.. తయారు చేసేవారూ అంతే నిష్టతో ఉంటారు.

సెట్టు రూ.13 వేల వరకు..

శివసత్తులు, పోతరాజులు, భక్తులు ధరించే ప్రత్యేక దుస్తులు, వస్తువులు 10-12 రకాలను ఒక సెట్టుగా విక్రయిస్తారు. అవసరాలను బట్టి విడివిడిగా కూడా అమ్ముతారు. ఒక సెట్టులో ఎల్లమ్మ గవ్వలు, ఈరకోల, ఢమరుకం, వల, ప్రతిమలు, కాళ్ల గజ్జలు, తాతులు, శూలం, గొంగళి, కుల్ల(గవ్వల టోపీ), నిలువు ప్యాంట్లు ఉంటాయి. నాణ్యతను బట్టి ఈసెట్టును రూ.6 వేల నుంచి రూ.13 వేల వరకు విక్రయిస్తారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మరింత ఆకర్షణగా మెషిన్ ఎంబ్రాయిడరీతో గజ్జెల లాగుల తయారీ వస్త్రాలపై దేవతల నమూనాలను కూడా వేస్తున్నారు. పూజకు కావాల్సిన ప్రతీ సామగ్రి ఇక్కడ లభిస్తుండడంతో జాతరల సీజన్‌లో వివిధ ప్రాంతాల భక్తులు నడికూడ బాట పడుతున్నారు.

ముహూర్తం చూసి కొనుగోళ్లు..

జాతరల సీజన్‌లో పట్నాలు, బోనాల మొక్కులు చెల్లించేవారు వారం రోజుల పాటు నిష్టగా ఉంటారు. ఒక్కపూట భోజనం.. ఉపవాస దీక్షలను పాటిస్తారు. ఇదే సమయంలో పట్నాలు, బోనాలు చెల్లించేవారు.. ప్రత్యేక దుస్తులు, వస్తువులను కూడా దైవసమానంగా భావిస్తారు. అందుకే వీటిని కొనేటప్పుడు మంచి ముహూర్తం చూసి కొంటారని దుస్తుల తయారీదారులు చెబుతున్నారు.



పూసల కుల





మల్లన్న బుట్ట

భక్తిశ్రద్ధలతో తయారు చేస్తాం..

గజ్జెల లాగులు కొనడానికి మన రాష్ట్రం నుంచే కాకుండా పక్క రాష్ట్రాల నుంచి కూడా వస్తారు. ఇక్కడ భక్తిశ్రద్ధలతో తయారు చేస్తాం. వర్క్ కూడా చాలా బాగా ఉంటుంది.

\- రావుల సుమలత, నడికూడ



మాకు ఇదే జీవనాధారం



నేను మా పూర్వీకుల నుంచి గజ్జల లాగుపోయడమే వృత్తిగా ఎంచుకున్నా. ఒక్కొక్క గజ్జెల లాగు తయారు చేయడానికి ఐదు రోజుల నుంచి వారం రోజుల సమయం పడుతుంది. చేతి పని ఎక్కువగా ఉంటుంది. ప్రభుత్వం సాయం చేయాలని కోరుకుంటున్నాం. మాకు ఇదే జీవనాధారం ఆదాయం అంతంత మాత్రమే ఉన్నప్పటికీ దేవుడిపై భక్తితో ఈ వృత్తిని కొనసాగిస్తున్నాం.

\- బుర్ర రవీందర్, నడికూడ

నడికూడకు రావాల్సిందే..



ఇక్కడ భక్తిశ్రద్ధలతో తయారు చేస్తారు. పట్నాలు, పెద్ద పట్నం, గట్టు మల్లన్న ఏ జాతరైనా మా తాతల కాలం నుంచే గజ్జల లాగుల కోసం నడికూడకు వచ్చేవారు. ధరలు కూడా అందరికీ అందుబాటులో ఉంటాయి.

\- రాజ్‌కుమార్ యాదవ్, సిరిసేడు, కరీంనగర్ జిల్లా

20 ఏళ్లుగా వస్తున్నాను..



ఏ పట్నం వేయాలన్నా కావాల్సిన పూజా సామగ్రి కోసం నడికూడకు రావాల్సిందే. నేను 20 ఏళ్లుగా వచ్చి తీసుకుని వెళ్తున్నాను. రూ.12 నుంచి రూ.15 వేలలో నాణ్యమైన గజ్జల లాగు సెట్టు దొరుకుతుంది.

\- రామ్మూర్తి, కేసముద్రం

పకడ్బందీగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు

- పోలింగ్ నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలి
- పీఓలు, ఏపీఓలు, ఓపీఓల పాత్ర కీలకం
- కలెక్టర్ రిజ్వాన్ బాషా



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్‌బాషా

జనగామ: వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉమ్మడి జిల్లా ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ హాలులో రెవెన్యూ విభాగం అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్‌తో కలిసి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ, పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ విధానంపై సెక్టార్, ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఓపీఓల మొదటి విడత శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. జిల్లాలో 1,002 ఉపాధ్యాయ ఓట్లకు గాను 12 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎలక్షన్ నేపథ్యంలో జిల్లాలో మూడు మండలాలకు ఒక రూట్ చొప్పున నాలుగు రూట్లను ఏర్పాటు చేయగా, నలుగురు సెక్టోరియల్ అధికారులను నియమించినట్లు చెప్పారు. మొదటి రూట్‌లో జనగామ, లింగాలఘణపురం, రఘునాథపల్లి మండలాలు ఉండగా, రెండవ రూట్‌లో కొడకండ్ల, దేవరుప్పుల, పాలకుర్తి, మూడవ రూట్ పరిధిలో చిల్పూర్, స్టేషన్‌ఘన్‌పూర్, జఫర్‌గఢ్, నాలుగవ రూట్ పరిధిలోకి నర్మెట, బచ్చన్నపేట, తరిగొప్పుల మండలాలు ఉన్నట్లు వెల్లడించారు.

అధికారుల పాత్ర కీలకం

ఉపాధ్యాయ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ నిర్వహణలో ఎలక్షన్ అధికారుల పాత్ర కీలకమని కలెక్టర్ అన్నారు. 17 మంది పీఓలు, 18 మంది ఏపీఓలు, 37 మంది ఓపీఓలు, 18 మంది మైక్రో అబ్జర్వర్‌ల పర్యవేక్షణలో ఎలక్షన్ నిర్వహించనున్నామన్నారు. అధికారుల సమన్వయంతో పని చేసి పొరపాటుకు తావులేకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాలెట్ పేపర్‌తో ఎన్నికలను నిర్వహించనున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ నెల 27న పోలింగ్

ఈ నెల 27వ తేదీన ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, సాయంత్రం ఓటింగ్ ముగిసే సమయంలో క్యూ లైన్‌లో ఉన్న వారికి టోకెన్ నంబర్లను ఇచ్చి, ఓటింగ్ వేసేలా చూడాలన్నారు. పోలింగ్ ఏజెంట్ల సమక్షంలోనే బ్యాలెట్ బాక్స్‌లను ఓపెన్ చేసి చూపించాలన్నారు. ఎన్నికల నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అంతకు ముందు ఎన్నికల నిర్వహణపై సెక్టార్ అధికారులు, పీఓలు, ఏపీఓలు, ఓపీఓలకు మాస్టర్ ట్రేనర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీకాంత్, కలెక్టరేట్ ఏఓ మన్సూరి, సెక్టార్ అధికారులు, ఎన్నికల విభాగం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

జనగామ రూరల్: పదోతరగతి వార్షిక పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని అందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని గీతాంజలి పబ్లిక్ పాఠశాలలో ఎస్సీ, బీసీ, మైనార్టీ వసతి గృహాలకు చెందిన పదవ తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలపై ప్రేరణ-అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సమయాన్ని వృథా చేయకుండా ప్రతీక్షణాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ వార్షిక పరీక్షల సన్నద్ధతకు ఆరు సూత్రాలను తప్పనిసరిగా అనుసరించాలని, వాటిలో యాక్షన్ ప్లాన్, స్మార్ట్ వర్క్, ఆరోగ్యం, మంచి నిద్ర, సాధన, ప్రేరణ వంటి సూత్రాలను పాటిస్తూ ప్రతీ విద్యార్థి పది ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్ర స్థాయిలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీఎస్సీడీఓ విక్రమ్, మైనార్టీ సంక్షేమ ప్రిన్సిపాల్స్ కుమారస్వామి, అనిల్, ఎస్సీ, బీసీ వసతి గృహాల అధికారులు పాల్గొన్నారు.

మరో అవకాశం!

- జిల్లాలో నేటి నుంచి కులగణన
- ప్రజాపాలన కేంద్రాల్లో వివరాల నమోదు



జనగామ: రాష్ట్రంలో తొలిసారి చేపట్టిన కులగణన సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే)కు ప్రభుత్వం మరోసారి శ్రీకారం చుట్టింది. గతేడాది చేపట్టిన సర్వేలో వివిధ కారణాలతో తమ వివరాలను నమోదు చేయించుకోలేని కుటుంబాలకు రెండవసారి అవకాశం కల్పించింది. నేటి నుంచి ఈ నెల 28వ తేదీ వరకు కుల గణన సర్వే జరగనుంది. ఇందుకు సంబంధించి 12 మండలాల పరిధిలో ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు సర్వేకు దూరంగా ఉన్న కుటుంబాలు ఆన్‌లైన్‌లో పొందుపరిన ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకోవాలి. అందులో కుటుంబ సమగ్ర వివరాలను పూర్తి చేసి, ప్రజాపాలన సేవా కేంద్రంలోని అధికారికి అందజేసి పేరును నమోదు చేసుకోవాలి. సందేహాల నివృత్తికి టోల్ ఫ్రీ నంబర్ 9052 308 621కు ఫోన్ చేసి సలహాలు, సూచనలు పొందవచ్చు.

సర్వేకు దూరంగా 15వేల కుటుంబాలు

గత ఏడాది నవంబర్ 6వ తేదీ నుంచి 8 వరకు ఇంటింటికీ స్టిక్కరింగ్ వేశారు. 9వ తేదీన మొట్టమొదటి సారిగా కులగణన సర్వే ప్రారంభించారు. 20 రోజుల పాటు సర్వే నిర్వహించి, 1,77,122 కుటుంబాల డాటాను ఆన్‌లైన్ ఎంట్రీ చేశారు. జిల్లాలో సుమారు 15 నుంచి 18 వేల కుటుంబాలు సర్వేకు దూరంగా ఉండగా, రెండవ సారి ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం కోరుతుంది. దీంతో కులాల వారీగా జిల్లాలో ఎంత మంది ఉన్నారనే విషయంలో స్పష్టత రానుంది.

సర్వేలో పాల్గొనండి..



ప్రభుత్వం నేటి నుంచి ఈ నెల 28వ తేదీ వరకు రెండవ సారి నిర్వహించే కుల గణనలో వివిధ కారణాలతో దూరంగా ఉన్న కుటుంబాలు తమ వివరాలను నమోదు చేయించుకోవాలి. 12 మండలాల పరిధిలోని ప్రజాపాలన సేవా కేంద్రాల్లో సమగ్ర వివరాలతో అధికారులకు అందించాలి. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకుని, సర్వేకు సహకరించాలి.

\- రిజ్వాన్ బాషా, కలెక్టర్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

అడిషనల్ కలెక్టర్ పింకేష్‌కుమార్



డ్రెయినేజీని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

స్టేషన్‌ఘన్‌పూర్: విద్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ అన్నారు. శనివారం ఘన్‌పూర్ శివారులోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలను ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా సోషల్ వెల్ఫేర్ పాఠశాల, కళాశాలకు చెందిన వంటగది, ల్యాబ్, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ఎప్పటికప్పుడు చెత్తను తొలగించేలా చర్యలు చేపట్టాలన్నారు. తాగునీరు సమస్య లేకుండా చూడాలని, మరుగుదొడ్ల మరమ్మతు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. అనంతరం స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ కార్యాలయాన్ని సందర్శించారు. పారిశుద్ధ్యం పనులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట కమిషనర్ రవీందర్, ఎంపీడీఓ విజయశ్రీ, తదితరులు ఉన్నారు.

పదిహేనేళ్ల నిరీక్షణకు తెర

2008 డీఎస్సీ అభ్యర్థులకు కాంట్రాక్టు ఉద్యోగాలు

- సర్టిఫికెట్ల వెరిఫికేషన్.. కౌన్సెలింగ్ పూర్తి
- జిల్లాలో 33 మందికి పోస్టింగ్
- ఈ నెల 17న విధుల్లోకి...



సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేస్తున్న డీఈఓ, అధికారులు

జనగామ: పదిహేనేళ్ల ఎదురుచూపులకు మోక్షం లభించింది. సర్కారు కొలువు కోసం చేసిన పోరాటం పట్టాలెక్కగా.. కోర్టు తీర్పు మేరకు కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగ బాధ్యతలను చేపట్టనున్నారు. కొందరిలో సంతోషం.. మరికొందరిలో నిరాశ. 2008లో డీఎస్సీ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు, 2010లో నిర్వహించిన రిక్రూట్‌మెంట్‌కు హాజరయ్యారు. ఎస్జీటీ పోస్టుల్లో బీఈడీ అభ్యర్థులకు అవకాశం ఇవ్వడంతో డీఈడీ అభ్యర్థులు కోర్టుకు వెళ్లడంతో ఉపాధ్యాయ నియామక ప్రక్రియ మధ్యలోనే ఆపేశారు. దీంతో ఉపాధ్యాయ కొలువు వస్తుందని ఆశగా చూసిన వేలాది మంది అభ్యర్థులకు నిరాశనే మిగిలింది. న్యాయం కోసం 15 ఏళ్లుగా పోరాటం చేస్తున్న అభ్యర్థులకు కోర్టు తీర్పుకు లోబడి ప్రభుత్వం తీపి కబురు అందించింది.


డీఈఓ కార్యాలయంలో కౌన్సెలింగ్..

2008 డీఎస్సీ నష్టపోయిన జిల్లాకు చెందిన 33 మంది అభ్యర్థులు కాంట్రాక్టు పద్ధతిలో సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ) ఉపాధ్యాయులుగా బాధ్యతలను తీసుకోనున్నారు. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ ఈ నెల 17వ తేదీలోగా ఉద్యోగ నియామకం చేపట్టాలని ఇచ్చిన ఆదేశాల మేరకు విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది. 33 మంది అభ్యర్థులకు జిల్లా విద్యాశాఖ అధికారి రమేశ్ నేతృత్వంలో కబురు పంపించగా... శనివారం ఒరిజినల్ సర్టిఫికెట్లతో డీఈఓ కార్యాలయానికి హాజరయ్యారు. అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించిన అనంతరం కలెక్టర్ ఆదేశాల మేరకు కౌన్సెలింగ్ ప్రారంభించారు. జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల పరిధిలోని ఖాళీ ఉపాధ్యాయ పోస్టులకు సంబంధించిన వివరాలను అందుబాటులో ఉంచారు. ఇందులో బచ్చన్నపేట-2, చిల్పూరు-2, దేవరుప్పుల-4, స్టేషన్ ఘన్‌పూర్-1, జనగామ-1, కొడకండ్ల-4, లింగాలఘణపురం-1, నర్మెట-2, పాలకుర్తి-7, రఘునాథపల్లి-5, తరిగొప్పుల-3 జఫర్‌గఢ్-1లో ఖాళీ ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు కౌన్సెలింగ్‌లో చూపించారు. అభ్యర్థుల మెరిట్ ప్రకారం వారు కోరుకున్న చోట పోస్టింగ్ ఇస్తూ ఆర్డర్ కాపీ ఇష్యూ చేశారు. ఆర్డర్ కాపీ తీసుకునే కాంట్రాక్టు ఉపాధ్యాయులు, ఎంఈఓకు రిపోర్టు చేయాల్సి ఉంటుంది.

కాంట్రాక్టు పద్ధతిలో...

హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులను అనుసరిస్తూ 2008 డీఎస్సీ బాధితులకు ప్రభుత్వం కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగాలను ఇస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. నెలవారి వేతనం రూ.31,040గా నిర్ణయించింది. విద్యా సంవత్సరం ప్రారంభమైన నాటి నుంచి ముగింపు చివరి దశ (ఏప్రిల్ 23వ తేదీ) వరకు పని చేసి, తిరిగి జూన్ 12 నుంచి కొత్త బాండ్ పేపర్‌తో మళ్లీ విధుల్లో చేరతారు. ఏసీ జీఈ రవికుమార్, యాదగిరి, మల్లికార్జున్, శ్రీధర్, నూరొద్దీన్, మెరుగు రామరాజు, కిరణ్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించగా, పలు ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

సంతోషంగా ఉంది..



2008లో డీఎస్సీ అర్హత సాధించి, 2010లో రిక్రూట్‌మెంట్ కోసం నియామక పత్రం తీసుకునే సమయంలో కోర్టు స్టేతో తమ ఆశలు ఆవిరైపోయాయి. న్యాయంగా తమకు రావాల్సిన ఉద్యోగం కోసం 15 ఏళ్లుగా పోరాటం చేస్తున్నాం. కోర్టు తీర్పునకు లోబడి ప్రభుత్వం తమను కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగం ఇవ్వడం సంతోషంగా ఉంది.

\- గద్దం కవిత, బీఈడీ, 2008 డీఎస్సీ అభ్యర్థి

ప్రభుత్వానికి కృతజ్ఞతలు



ప్రభుత్వం కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగాలు ఇవ్వడం సంతోషంగా ఉంది. ప్రస్తుతం ప్రైవేట్ స్కూల్‌లో పని చేస్తున్న. ఈ నెల 17వ తేదీ నుంచి ఉద్యోగ నియామక బాధ్యతలు తీసుకుని, విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తా. 15 ఏళ్ల పోరాటంలో సుమారు రూ.లక్షకు పైగా ఖర్చు అయింది.

\- ఎం.రమేశ్, శివునిపల్లి

సేవాలాల్ ఆశయ సాధనకు కృషి

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి

పాలకుర్తి టౌన్: సంత్ సేవాలాల్ మహరాజ్ ఆశయ సాధనకు కృషి చేయాలని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. శనివారం సంత్‌సేవాలాల్ మహరాజ్ 286వ జయంతి సందర్భంగా నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన గిరిజనులు ర్యాలీగా తరలివచ్చి సేవాలాల్ మహరాజ్‌కు పూజలు చేశారు. గిరిజన వేషధారణలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమండ్ల ఝాన్సీరెడ్డి పూజలు నిర్వహించి ప్రత్యేకంగా తయారు చేసిన నైవేద్యాన్ని సమర్పించారు. రాజకీయాలకతీతంగా గిరిజనులు పాల్గొని భోగ్ బండార్‌ను తిలకించి పూజలు నిర్వహించారు. అనంతరం సేవాలాల్ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు హమ్యానాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. గిరిజనుల సంక్షేమం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. నియోజవర్గంలోని ప్రతీ మండలంలో సేవాలాల్ భవనం ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్లు లావుడియ మంజుల, తిరుపతిరెడ్డి, హమ్యానాయక్, లావుడియ్య భాస్కర్, దరావత్ రోజా, సరేష్‌నాయక్, రాజేష్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మినీ జాతర

మేడారంలో నాలుగు రోజులు సందడి | లక్షల సంఖ్యలో తరలివచ్చిన భక్తులు | జాతర ఏర్పాట్లను పర్యవేక్షించిన మంత్రి సీతక్క



ఎస్ఎస్ తాడ్వాయి : మేడారం మినీ జాతర శనివారం ముగిసింది. ఈనెల 12వ తేదీన ప్రారంభమైన చిన్న జాతర.. నాలుగు రోజుల పాటు కొనసాగింది. ఈ సందర్భంగా పూజారులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి లక్షలాది మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మినీజాతర సందర్భంగా లక్షలాది మంది భక్తులతో మేడారం సందడిగా మారింది. రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి సీతక్క జాతర నిర్వహణను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ప్రణాళిక ప్రకారం అధికారులతో నిత్యం సమావేశాలు నిర్వహించి జాతరలో ఏర్పాట్లు చేశారు. గతంలో మినీజాతరకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిధులు కేటాయించకపోయేది. ఈసారి మాత్రం మంత్రి సీతక్క చొరవతో భక్తుల సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం రూ.5 కోట్లు కేటాయించింది. మినీ జాతరకు వచ్చే భక్తుల సంఖ్య నానాటికీ పెరుగుతుండడంతో మహాజాతరను తలపిస్తోంది.



సమ్మక్కకు మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

ఆర్టీసీ బస్సుల్లో వేలాది మంది తరలింపు..

మినీ మేడారం జాతరకు ఆర్టీసీ వేలాది మంది భక్తులను తరలించింది. గతంలో పోల్చుకుంటే ఈసారి మినీ జాతరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసి భక్తులను చేరవేసింది. సుమారు 25 వేల పైగా మంది భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించినట్లు అధికారులు తెలిపారు. మేడారం ఆర్టీసీ బస్టాండ్‌లో మహాజాతర, ఇతర సమయంలో తాత్కాలికంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే శాశ్వత ప్రాతిపదికన బస్ షెల్టర్, టాయిలెట్స్, తాగునీరు, ఇతర వసతులు కల్పించాలని భక్తులు కోరుతున్నారు.



పోలీసు శాఖ పటిష్ట బందోబస్తు..

జాతరలో పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసింది. ఎస్పీ శబరీశ్ పర్యవేక్షణలో నాలుగు రోజుల పాటు జరిగిన జాతరలో ఎక్కడా వాహనాల ట్రాఫిక్ జామ్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. భక్తుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. మినీజాతరలో చైన్ స్నాచింగ్, చోరీ, పాస్‌పోర్టు రికవరీ లాంటి వాటిని క్షణాల్లో ఛేదించడంతో పోలీస్ సేవలను భక్తులు ప్రశంసించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని గద్దెల ప్రాంగణంలో దొంగల చేతివాటం ప్రదర్శించకుండా సీసీ కెమెరాలు, సీసీఎస్ పోలీసులతో పటిష్ట నిఘా ఏర్పాటు చేశారు. దీంతో ఎక్కడా భక్తులకు దొంగల వల్ల ఇబ్బంది కలగలేదు.

రెండు బావుల ద్వారా షవర్లకు నీరు..

ఇరిగేషన్ శాఖ అధికారులు కష్టం ఫలించింది. భక్తులకు జల్లు (షవర్) స్నానాల కోసం జంపన్నవాగులో రెండు ఇన్‌ఫిల్టరేషన్ బావుల ద్వారా వాగు ఒడ్డున ఏర్పాటు చేసిన 20 షవర్లకు నీరు అందించారు. భక్తులు తనివితీరా స్నానాలు చేశారు.

పారిశుద్ధ్య సేవలు భేష్..

మేడారం మినీజాతరలో జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య సేవలు చేపట్టారు. జాతర ప్రారంభానికి వారం రోజుల ముందు నుంచి మొదలు.. శనివారం వరకు పారిశుద్ధ్య కార్మికులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చెత్త తొలగించారు. ఎక్కడా చెత్త నిల్వ ఉండకుండా చర్యలు తీసుకున్నారు. దీంతో జాతరలో పారిశుద్ధ్య సేవలు భేష్ అని భక్తులు కొనియాడారు. జాతరలో దుమ్ము లేవకుండా ట్యాంకర్లతో జంపన్నవాగు – ఆర్టీసీ బస్టాండ్ వై జంక్షన్, రద్దీగా ఉండే రోడ్లపై రోజుకు మూడు ట్రిప్పులు నీళ్లు చల్లించారు. డీపీఓ దేవరాజ్ నిత్యం పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించారు.

తల్లుల మొక్కులు చల్లగా..

దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తులకు తల్లుల దర్శనాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో క్యూ ద్వారా గద్దెల పైకి వెళ్లి దర్శనాలు చేసుకునే భక్తులకు ఎండవేడి తగలకుండా చలువ పందిళ్లు, తాగునీటి సౌకర్యం కల్పించారు. ఫలితంగా భక్తులకు ఎండల నుంచి ఉపశమనం లభించింది. కాగా, ఈసారి జాతరలో లక్షలాది మంది భక్తులను నేరుగా గద్దెల పైకి అనుమతించడంతో అమ్మవార్లకు తనివితీరా మొక్కులు చెల్లించుకున్నారు. దేవాదాయ శాఖ తరఫున జాతర పాల్గొన్న అన్ని శాఖ అధికారులు, సిబ్బంది, మీడియా, స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులకు ఎండోమెంట్ కార్యాలయంలో ఉచిత భోజన వసతి కల్పించారు. దేవాదాయ శాఖ అధికారులు, సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండి భక్తులకు సేవలందించారు.



పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు



షవర్ల కింద స్నానాలు చేస్తున్న భక్తులు



మేడారంలో ఆర్టీసీ బస్టాండ్

రూ.21.56 కోట్లతో 65 పనులు

- త్వరలో ప్రారంభం కానున్న సరస్వతీనది పుష్కరాల పనులు



సరస్వతి పుష్కరాలు జరిగే త్రివేణి సంగమం (వీఐపీఘాట్)

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో మే 15 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించే సరస్వతీనది పుష్కరాలకు ప్రభుత్వం ముందస్తుగానే నిధులు మంజూరు చేసింది. పలుమార్లు దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ సమీక్షలు చేపట్టి భక్తుల సౌకర్యార్థం ఏమేమి పనులు చేయాలనే విషయాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మంథని ఎమ్మెల్యే, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సంబంధిత శాఖ మంత్రి కొండా సురేఖ ప్రభుత్వం తరఫున రూ.25కోట్ల నిధులు మంజూరు చేయించారు. కలెక్టర్ రాహుల్‌శర్మ పనులకు షార్ట్‌టెండర్లు పిలిచి పరిపాలన అనుమతుల ఉత్తర్వులు ఇచ్చారు. రూ.21.56కోట్ల నిధులతో 65 పనులను ఐదుశాఖల ద్వారా చేపట్టనున్నారు. అందులో ఇరిగేషన్‌శాఖ 4 పనులకు 5.31కోట్లు, పంచాయతీరాజ్‌శాఖ 7 పనులకు రూ.3.1కోట్లు, ఈఈ(ఆర్‌డబ్ల్యూస్) ఎంబీ ఇన్‌ఫ్రా 15 పనులకు రూ.2.28కోట్లు, ఈఈ ఎండోమెంట్ 28 పనులకు రూ.9.96కోట్లు, టీజీఎస్పీడీసీఎల్ 11 పనుల కోసం రూ.99.39లక్షలకు అనుమతులను కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, పుష్కరాలకు సింగరేణి సీఎస్‌ఆర్ నిధులు రూ.10కోట్లు కూడా ఇవ్వనున్నట్లు అధికారుల ద్వారా తెలిసింది.

బీరు సీసాలతో దాడి..

- ముగ్గురికి గాయాలు

కమలాపూర్: కమలాపూర్ మండలం అంబాలలోని మద్యం దుకాణ పర్మిట్ రూంలో శుక్రవారం రాత్రి యువకులు ఘర్షణ పడ్డారు. కొందరు యువకులు మరికొందరిపై బీరు సీసాలతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో మండలంలోని నేరెళ్లకు చెందిన గోల్కొండ ఉదయ్‌తేజ, అతడి మిత్రులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వీరభద్రరావు శనివారం తెలిపారు. అంబాలకు చెందిన కొందరు యువకులు స్థానిక మద్యం పర్మిట్ రూంలో మద్యం తాగుతుండగా ఉదయ్‌తేజ, అతడి మిత్రులు రెండు ఆటోల్లో పర్మిట్ రూం సమీపంలోకి వచ్చి అదేపనిగా హారన్ కొడుతున్నారు. దీంతో అలా ఎందుకు హారన్ కొడుతున్నారని గందసిరి నగేశ్ అనే యువకుడు అడగడంతో ఘర్షణ మొదలైంది. ఆ ఘర్షణ ఆపడానికి వెళ్లిన శీలం సందీప్‌పై బీరు సీసాతో దాడి చేయగా అక్కడే ఉన్న బోయిని నరేశ్, శీలం రాకేశ్ ఆ దాడిని ఆపడానికి ప్రయత్నించగా ఉదయ్‌తేజ, అతడి మిత్రులు వారిపై కూడా బీరు సీసాలు, కర్రలతో దాడి చేయడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై సందీప్ ఫిర్యాదు మేరకు ఉదయ్‌తేజతో పాటు అతడి మిత్రులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వీరభద్రరావు తెలిపారు.

రామప్ప గార్డెన్‌లో మాంసాహారంతో భోజనం

- అభ్యంతరం తెలిపిన పర్యాటకులు
- పట్టించుకోని పురావస్తుశాఖ అధికారులు

వెంకటాపురం(ఎం): ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయంలో విహార యాత్రకు వచ్చిన విద్యార్థులు ఉపాధ్యాయులు అందించిన మాంసాహారంతో భోజనం చేశారు. దీనిపై పలువురు పర్యాటకులు అభ్యంతరం తెలిపారు. జనగామ జిల్లా తరిగొప్పులకు చెందిన ఓ పాఠశాల విద్యార్థులను ఉపాధ్యాయ బృందం విహార యాత్రకు రామప్పకు తీసుకొచ్చారు. మధ్యాహ్నం సమయంలో ఆలయ ప్రాంగణంలోని గార్డెన్‌లో చికెన్ బిర్యానీ ప్యాకెట్లు అందించడంతో విద్యార్థులు భోజనం చేస్తున్నారు. ఈక్రమంలో స్థానికులు, పర్యాటకులు గమనించి పవిత్ర రామప్ప ఆలయ ప్రాంగణంలో మాంసాహారంతో విద్యార్థులకు భోజనం ఎలా పెడతారని ఉపాధ్యాయులతో వాగ్వాదానికి దిగారు. అరగంటకు పైగా పర్యాటకులు, ఉపాధ్యాయ బృందానికి గొడవ జరుగుతున్నా స్థానిక పురావస్తుశాఖ సిబ్బంది అటువైపు కన్నెత్తి చూడలేదని స్థానికులు పేర్కొంటున్నారు. చివరకు ఉపాధ్యాయులు పొరపాటు జరిగిందని ఒప్పుకోవడంతో పర్యాటకులు శాంతించారు. రామప్ప ఆలయాన్ని కంటికి రెప్పలా కాపాడాల్సిన పురావస్తు శాఖ అధికారులు నిర్లక్ష్యం కారణంగానే ఇలాంటి ఘటనలు పునరావృతవుతున్నాయని స్థానికులు ఆరోపించారు. దీనిపై శాఖ ఉన్నతాధికారులు స్పందించి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు, పర్యాటకులు కోరుతున్నారు.

డీసీఎంను ఢీకొన్న లారీ..

- ఇద్దరు డ్రైవర్లకు స్వల్ప గాయాలు



ఘటనాస్థలిలో డీసీఎం, లారీ

ములుగు రూరల్: పత్తి లోడ్‌తో వస్తున్న డీసీఎంను లారీ ఎదురుగా ఢీకొంది. ఈ ఘటన శనివారం మండలంలోని జాకారం సమీపంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి పత్తి లోడ్‌తో హనుమకొండ వైపునకు వెళ్తున్న డీసీఎంను గట్టమ్మ సమీపంలో ఎదురుగా వస్తున్న ఇసుక లారీ ఢీకొంది. దీంతో డీసీఎం బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఇరువురు డ్రైవర్లకు స్వల్ప గాయాలయ్యాయి. జాతీయ రహదారిపై ప్రమాదం జరగడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

భావితరాల కోసమే 'చిందోళ్ల చరిత్ర'

- పద్మశ్రీ గడ్డం సమ్మయ్య



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, సమ్మయ్య

దేవరుప్పుల : భావితరాల కోసమే 'చిందోళ్ల చరిత్ర' గ్రంథం రూపొందించారని ప్రముఖ చిందు యక్షగానక ళాకారుడు, పద్మశ్రీ గడ్డం సమ్మయ్య తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్‌లో డాక్టర్ గడ్డం మోహన్ రావు రచించిన ' చిందోళ్ల చరిత్ర – సాహిత్యం, సంస్కృతి' గ్రంథాన్ని కేంద్ర సాంస్కృతిక, బొగ్గుగనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డితో కలిసి ఆవిష్కరించినట్లు సమ్మయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జోన్ అధ్యక్షుడు లంకల సందీప్ రెడ్డి, గడ్డం హిమగిరి తదితరులు పాల్గొన్నారు.

మందుల నిల్వల్లో పారదర్శకత పాటించాలి

- టాస్క్‌ఫోర్స్ ప్రధానాధికారి ప్రేమ్‌కుమార్



నేత్ర వైద్యశాలలో తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం

ఎంజీఎం/ఆత్మకూరు : ఆస్పత్రుల్లో ఔషధాల నిల్వల విషయంలో పారదర్శకత పాటించాలని తెలంగాణ పారామెడికల్ బోర్డు కార్యదర్శి, టాస్క్ ఫోర్స్ ప్రధానాధికారి ప్రేమ్‌కుమార్ అన్నారు. ఆస్పత్రుల్లో ఔషధాల కొరత లేకుండా చర్యలు చేపట్టేందుకు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి ఆదేశాలతో ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు శనివారం వరంగల్ నేత్రవైద్యశాల, కేశవపూర్, ఆత్మకూర్ పీహెచ్‌సీలు, వరంగల్ సెంట్రల్ స్టోర్స్, ఎస్ఆర్ఆర్ తోట అర్బన్ హెల్త్ సెంటర్‌లను సందర్శించారు. ఔషధాలు, ఇండెంట్లు, నిల్వలు, ఈ–ఔషధి వ్యాక్సిన్ల నిల్వలు తనిఖీ చేశారు. నిల్వల లెక్కల్లో తేడా ఉండొద్దని, క్షేత్ర స్థాయిలో మందుల కొరత లేకుండా ఆస్పత్రులకు సీడీఎస్ నుంచి సరఫరా అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ భరత్‌కుమార్, వరంగల్ డీఎంహెచ్‌ఓ బి.సాంబశివరావు, ఉమ్మడి వరంగల్ జిల్లా సెంట్రల్‌డ్రగ్ స్టోర్స్ ఇన్‌చార్జ్ ఉప్పు భాస్కర్‌రావు, మహేశ్వరం వైద్యకళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ సయీద్‌అహ్మద్, ఫుడ్‌సేఫ్టీ అధికారి ధర్మేంద్ర, ఫార్మసీ సూపర్‌వైజర్ నాగమణి, సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



దినేశ్ (ఫైల్)

రఘునాథపల్లి: జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు.. రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన జనగామ రైల్వే స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. జనగామ జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ రమణారెడ్డి, కానిస్టేబుల్ నరేశ్ కథనం ప్రకారం.. రఘునాథపల్లి గ్రామానికి చెందిన గంద్ర శ్రీధర్, రజిత దంపతుల చిన్న కుమారుడు దినేశ్ (25) హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. వేతనం సరిపోకపోవడంతో కొన్ని రోజుల నుంచి మనస్తాపం చెందుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన దినేశ్.. శనివారం తెల్లవారుజామున జనగామ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసులు మృతుడి వివరాలు తెలుసుకుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహానికి జనగామ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. కాగా, యువకుడి మృతితో కుటుంబంతోపాటు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

దుబ్బతండాలో వృద్ధురాలు..

డోర్నకల్: డోర్నకల్ మండలం దుబ్బతండాకు చెందిన ఓ వృద్ధురాలు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. హెడ్‌కానిస్టేబుల్ రామన్న కథనం ప్రకారం.. తండాకు చెందిన ఇస్లావత్ పద్మ(63)కు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉండగా పెద్దకుమారుడు నాలుగేళ్ల క్రితం చనిపోయాడు. కుమారుడి మృతితో మనస్తాపానికి గురైన పద్మ మద్యానికి బానిసగా మారింది. ఈ క్రమంలో శనివారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈఘటనపై చిన్న కుమారుడు నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ రామన్న తెలిపారు.

బిల్డింగ్ పైనుంచి పడి ఒకరి మృతి



శంకర్(ఫైల్)

కురవి: బిల్డింగ్‌పై నుంచి పడి ఒకరు మృతి చెందారు. ఈ ఘటన మండలంలోని నేరడ శివారు చంద్రు తండాలో చోటు చేసుకుంది. ఎస్సై గంద్రాతి సతీశ్ కథనం ప్రకారం.. తండాకు చెందిన ధరంసోత్ శంకర్(38), మంగమ్మ దంపతులు శుక్రవారం రాత్రి తమ భవనంపై(బిల్డింగ్) నిద్రించారు. ఈ క్రమంలో రాత్రి 11 గంటల సమయంలో మూత్రవిసర్జన కోసం శంకర్ నిద్ర నుంచి లేచి బిల్డింగ్ దిగుతూ కిందపడ్డాడు. ఈ ఘటనలో తీవ్రగాయాలు కావడంతో 108లో మహబూబాబాద్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి హరియ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు నవీన్, రవీందర్, కుమార్తె రోజా ఉన్నారు.

పది రోజుల వ్యవధిలోనే దంపతుల మరణం

- గురిజాలలో ఘటన

నర్సంపేట రూరల్ : పది రోజుల వ్యవధిలోనే దంపతులు మరణించారు. ఈ ఘటన నర్సంపేట మండలం గురిజాలలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మెట్టు మల్లయ్య (80) ఈనెల 6వ తేదీన గుండెపోటుతో మృతిచెందాడు. ఈ క్రమంలో మల్లయ్య భార్య సమ్మక్క (73) శ్వాస సంబంధిత వ్యాధితో శనివారం మృతిచెందింది. ఇలా పది రోజుల వ్యవధిలోనే ఇద్దరు మరణించడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగారు. ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

చైతన్యం వైపు నడిపించిన ప్రబోధకుడు సేవాలాల్

- కేయూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్: బంజారా జాతిని చైతన్యం వైపు నడిపించిన ధర్మప్రబోధకుడు సంత్ సేవాలాల్ మహరాజ్ అని కాకతీయ యూనివర్సిటీ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్ 286 జయంతి సందర్భంగా శనివారం కాకతీయ యూనివర్సి టీ ఆడిటోరియం గ్రౌండ్‌లో నిర్వహించిన మహా భోగ్ భండారోలో వీసీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.సేవాలాల్ ధర్మం వైపు నడిపించిన గొప్పవ్యక్తి అని కొనియాడారు. మన మూలాలను మరవొద్దన్నారు. విద్యార్థులు సేవాలాల్ మహారాజ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. మహబూబాబాద్ మాజీ ఎంపీ, కేయూ బాటనీ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ అజ్మీరా సీతారాంనాయక్ మాట్లాడుతూ నేటి బంజారా యువత బంజారా సంస్కృతిని మరవొద్దన్నారు. దేశంలో 12 కోట్ల మంది బంజారాలు ఉన్నారన్నారు. ఒకే భాష మాట్లాడుతున్నారన్నారు. ఆ భాషను 8వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. కేయూ రిజిస్ట్రార్ వి. రామచంద్రం మాట్లాడుతూ విద్యార్థులు సంత్ సేవాలాల్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. కేయూ ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ తుమ్మల రాజమణి, అకడమిక్ డీన్ జి. హనుమంతు, పాలకమండలి సభ్యులు బి. రమ, చిర్రరాజు, సుదర్శన్, ఇంగ్లిష్‌విభాగం అధిపతి దీపాజ్యోతి,యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ టి. మనోహర్, కేయూ అభివృద్ధి అధికారి వాసుదేవరెడ్డి, ఎన్ఎస్ఎస్‌కో ఆర్డినేటర్ ఈసం నారాయణ, కె. మమత, రాజునాయక్, రాంచందర్, తేజావత్ జువేర్ తదితరులు పాల్గొన్నారు. తొలుత విద్యార్థులు బంజారా నృత్యాలతో ప్రదర్శనగా క్యాంపస్‌లోని ఆడిటోరియం వరకు చేరుకున్నారు.

సామాజిక శాస్త్రాల పరిశోధన పద్ధతులపై వర్క్‌షాప్

- జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి బాబురావు




బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ బాబురావు, కేయూ ఓఎస్‌డీ మల్లారెడ్డి, వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, తదితరులు

హన్మకొండ కల్చరల్ : పరిశోధన సిద్ధాంత గ్రంథాల రూపకల్పనపై అవగాహన కల్పించేందుకు సామాజిక శాస్త్రాల పరిశోధన పద్ధతులపై జాతీయ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామని జానపద గిరిజన విజ్ఞాన పీఠం పీఠాధిపతి ప్రొఫెసర్ భూక్య బాబురావు తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను శనివారం పీఠంలో ప్రొఫెసర్ బాబురావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కేయూ ఓఎస్‌డీ మల్లారెడ్డి, వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, పింగిళి కాలేజీ ప్రొఫెసర్ ధరావత్ పార్వతీనాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ జానపద గిరిజన విజ్ఞానపీఠంలో ఏప్రిల్ 12, 13, 14 తేదీల్లో జాతీయ వర్క్‌షాపు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో పాల్గొనే వారు ఏప్రిల్ 8వ వరకు రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చన్నారు. వివరాలకు 90309 99640, 99891 39136 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు. ఓఎస్‌డీ మల్లారెడ్డి మాట్లాడుతూ పరిశోధకులకు వర్క్‌షాప్ ఉపయోగపడుతుందన్నారు. ఏసీపీ నందిరాంనాయక్ మాట్లాడుతూ వర్క్‌షాప్‌తో పరిశోధకులకు సమగ్ర అవగాహన కలుగుతుందన్నారు కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీమంతుల దామోదర్, డాక్టర్ చూరేపల్లి రవికుమార్, డాక్టర్ బాసాని సురేశ్, అబ్బు గోపాల్‌రెడ్డి, వీడియోగ్రాఫర్ డాక్టర్ గంపా సతీశ్, సిద్దోజు సునంద, ఆంజనేయులు, అశోక్, కస్తూరిబాయి తదితరులు పాల్గొన్నారు.

8.810 కేజీల గంజాయి పట్టివేత

- ముగ్గురి అరెస్ట్, రిమాండ్



స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న సీఐ సాయిరమణ, ఎస్సై రఘుపతి

ఖానాపురం: 8 కేజీల 810 గ్రాముల గంజాయి పట్టుకుని ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నర్సంపేట రూరల్ సీఐ సాయిరమణ తెలిపారు. ఈ మేరకు శనివారం ఖానాపురం పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్సై రఘుపతితో కలిసి వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌లోని హసన్‌నగర్‌కు చెందిన అస్వద్, హైదరాబాద్‌లోని పోచమ్మ బస్తీకి చెందిన మోహిత్ కుమార్, అమిత్‌కుమార్.. ఒడిశాలోని బరంపూర్‌లో ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ గంజాయి అలవాటు చేసుకున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో గంజాయికి ఎక్కువ ధర ఉండడంతో రెండు రోజుల క్రితం ఒడిశా వెళ్లి గంజాయి కొనుగోలు చేశారు. ఈనెల 14న మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌లో దిగి అక్కడి నుంచి ప్రైవేట్ వాహనంలో వెళ్తున్నారు. ఈ క్రమంలో ఖానాపురం శివారులోని ఎఫ్‌సీఐ గోదాంల వద్ద పోలీసులు వాహన తనిఖీ చేస్తుండగా చూసి పారిపోతుండగా అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. ఇందులో రూ.2,20,250 విలువైన 8.810 కేజీల గంజాయి లభించడంతో స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నర్సంపేట రూరల్ సీఐ సాయిరమణ తెలిపారు.